క్లుప్తంగా

అందుబాటులో ఎరువులు

రాయికోడ్(అందోల్): రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కొరత లేకుండా తగిన నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా తదితర ఎరువులు, వివిధ కంపెనీలకు సంబంధించిన పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి వారం ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల విక్రయాలు, నిల్వలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. పంటల సాగులో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. పెట్టుబడులు తగ్గించుకుని, ఆశించిన దిగుబడులు పొందడంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

సోదరుడు అదృశ్యంపై ఫిర్యాదు


సాయికృష్ణ

పటాన్‌చెరు టౌన్: సోదరుడు అదృశ్యంపై అన్న ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కుర్షిత్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సాయికృష్ణ పాశమైలారం పారిశ్రామికవాడలోని ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ ఇస్నాపూర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. అయితే ఈ నెల 9వ తేదీన సాయికృష్ణ కొండాపూర్‌లో సోదరుని దగ్గరికి వస్తున్నానని తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. కాగా సాయికృష్ణ సోదరుడి దగ్గరికి ఎంతకూ రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం సాయికృష్ణ అదృశ్యంపై అతడి అన్న సతీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ సురేష్‌షెట్కార్‌కు సన్మానం


ఎంపీ సురేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న మహిళా మండలి సభ్యులు

నారాయణఖేడ్: బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని హైదర్‌గూడలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో అఖిల భారత మహిళా మండలి ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీగా గెలిచిన సురేష్‌షెట్కార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆది జగద్గురు పంచాచార్య యాగ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాశీజగద్గురు, ఉజ్జయిని జగద్గురు, శ్రీశైలం జగద్గురు, బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పారిశుద్ధ్యం పనులను తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

యువకుడు అదృశ్యం


ముర్తాజఖాన్

సంగారెడ్డి: యువకుడు అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాంచంద్రారెడ్డి కాలనీ చెందిన ముర్తాజఖాన్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 08455276333, 8712656718 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఫీజుల భారం తగ్గించాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం తగ్గించడంతో పాటు విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయం వద్ద డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతున్నారన్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, డ్రెస్సులు, నోట్‌బుక్స్‌లు షూ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, యూసుఫ్, ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లయినా.. పట్టింపేదీ?

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయినా నేటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోలేకపోతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి కనీసం కూర్చోవడానికి ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలం కేటాయించినట్లు ప్రచారం జరిగినా ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. చాలా కాలం పాటు ప్రైవేట్ భవనంలో కొనసాగిన ఎక్సైజ్ కార్యాలయ భవనాన్ని గతేడాది క్రీడామైదానం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో కొత్త భవన నిర్మాణం చేపట్టారు.

– జోగిపేట(అందోల్)


జోగిపేటలోని ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- శిథిలావస్థ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఏళ్ల తరబడి ప్రైవేట్ భవనంలోనే కొనసాగింపు
- కార్యాలయం వద్ద నిత్యం ట్రాఫిక్ జాం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు, వినియోగదారులు


పెచ్చులు ఊడిన పైకప్పు

జోగిపేట పట్టణంలో కురుమ సంఘం భవనంలో రిజిస్ట్రార్ కార్యాలయం ఏళ్ల తరబడి అద్దెలో కొనసాగుతోంది. ఈ కార్యాలయానికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చే కార్లను రోడ్డుపైనే నిలుపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదరవుతున్నాయని, ఈ విషయాన్ని అధికారులు, పోలీసుశాఖ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని అధికారులు వాపోతున్నారు.

పెచ్చులూడుతున్న కార్యాలయం పైకప్పు

జోగిపేటలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భవనం పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతోంది. కార్యాలయం పారిశ్రామిక సహకార సంస్థ భవనంలో కొనసాగుతోంది. కార్యాలయంలో రికార్డు, కంప్యూటర్ గదులు మాత్రమే ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూర్చునేందుకు సౌకర్యంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

సామూహిక భవన నిర్మాణాలపై మంత్రి దృష్టి

నియోజకవర్గ కేంద్రంలో సామూహిక ప్రభుత్వ భవన నిర్మాణాలను చేపట్టే విషయమై మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని ఒకేచోట నిర్మించేందుకు అధికారులకు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించినట్లు తెలిసింది. ఎంపీపీ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం ఆవరణలో నిర్మించతలపెట్టినట్లు తెలిసింది.

> **నిధులు మంజూరు కాలేదు**
>
> రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించినట్లుగా తనకు ఎలాంటి సమాచారం లేదు. ప్రైవేట్ భవనంలో కొనసాగుతుండటంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమే. ముఖ్యంగా కార్యాలయం ముందు వాహనాలను నిలపడానికి స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతన భవన నిర్మాణం చేపట్టే విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతాం.
>
> హబీబొద్దీన్, సబ్ రిజిస్ట్రార్ , జోగిపేట


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురుఆరం ఆయన మండల కేంద్రమైన గుమ్మడిదలలో హానర్స్ లాబ్స్ వారి సౌజన్యంతో రూ. 20 లక్షల నిధులతో నిర్మించాల్సిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు షేక్‌హుస్సేన్, విజయభాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సర్టిఫికెట్ల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిపురం గ్రామానికి చెందిన సంగన్నగారి వీరగౌడ్‌కు వికలాంగుల ధ్రువపత్రాలను అందించినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో మండల కేంద్రంలో చేపట్టిన దివ్యాంగుల సదరం క్యాంపునకు 12 మందికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అందులో వివిధ గ్రామాలకు చెందిన 8 మందికి ప్రభుత్వం సర్టిఫికెట్లను మంజూరు చేసిందన్నారు.


దివ్యాంగుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న శివశంకర్‌రావు

కార్యక్రమంలో మచ్చ నరేందర్, వెంకట్‌రెడ్డి, నరోత్తంరెడ్డి నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): హరితహారంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కల్హేర్ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. కల్హేర్‌లో ఉపాధిహామీ సిబ్బందితో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటి సంరక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీని పున ప్రారంభించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్

జహీరాబాద్ టౌన్: రెండు నెలల నుంచి మూతబడిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీని వెంటనే పున ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ డిస్పెన్సరీని తెరిపించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో పెద్దసంఖ్యలో పరిశ్రమలు ఉండగా సుమారు 5వేలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికుల వైద్యం కోసం పట్టణంలో ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయగా సొంత భవనంలేక అద్దె ఇంటిలో కొనసాగిస్తున్నారన్నారు. రెండేళ్ల నుంచి అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఇంటి యజమాని తాళం వేయగా మూత పడిందన్నారు. డిస్పెన్సరీకి ప్రతిరోజు సుమారు 200 మంది రోగులు వస్తుంటారని తెలిపారు. డిస్పెన్సరీ మూతపడటంతో బీపీ, షుగర్ ఇతర దీర్ఘకాలపు రోగులు ఉన్న వారికి తిప్పలు తప్పడంలేదన్నారు. అద్దె చెల్లింపు విషయంలో ఈఎస్‌ఐ అధికారుల్లో స్పందనలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల నుంచి ప్రతి నెల సుమారు రూ.20 లక్షల వరకు ఈఎస్‌ఐకి చేరుతుందన్నారు. కానీ అద్దె చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయిలు చెల్లించి డిస్పెన్సరీని వెంటనే తెరిపించి రోగులకు వైద్య సేవలను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సంగారెడ్డిలోని డీఆర్‌ఓ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహీంద్ర కర్మాగారం యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజీరెడ్డి, నాయకులు గణేష్, బాలరాజ్, నరేష్, బాబు, నందమ్మ శశికళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డిస్పెన్సరీ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

న్యాల్‌కల్(జహీరాబాద్): సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్ అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు సోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురుగు కాల్వలు, వాటర్ ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులను ఉత్తములుగా తీర్చేందుకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. గుండు లక్ష్మణ్ స్కూల్ అసిస్టెంట్ నుంచి పీజీ హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. మండలంలోని మార్డి ఉన్నత పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శైలజ కులకర్ణి, ఉపాధ్యాయులు మోహన్, రాజయ్య, సంజీవ్‌కుమార్, మశ్చేందర్, మురళిగౌడ్, బాచ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య


జిన్నారంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, నాయకులు


ఝరాసంగం: ఈదులపల్లిలో పుస్తకాలు అందజే స్తున్న ఎంపీటీసీ శంకర్‌పాటిల్

జిన్నారం(పటాన్‌చెరు): సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీటీసీ లావణ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో అన్ని ఉచిత వసతులతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్, గ్రామ అధ్యక్షుడు శంరయ్య, నాయకులు కోటేష్‌గౌడ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, ప్రవీన్, వెంకటేశ్, బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదులపల్లి గ్రామంలో...

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్ పాటిల్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బస్వరాజ్ పటేల్, ప్రధానోపాధ్యాయురాలు వనజ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ఝరాసంగంలో..

నోటుబుక్కులు పంపిణీ

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందికి ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బందికి గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజు, చిరంజీవి, షఫీఉద్దీన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అందోలు బాలుర ఉన్నత పాఠశాలలో..

జోగిపేట(అందోల్): అందోలులోని బాలుర ఉన్నత పాఠశాలలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరు గాలి.. జోరు వాన


ఇళ్ల పైకప్పులు లేచిపోయిన దృశ్యం

- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- తెగిపోయిన విద్యుత్ తీగలు


విరిగిపడిన చెట్లు

వట్‌పల్లి (అందోల్): మండల పరిధిలోని కసాన్‌పల్లి గ్రామంలో గురువారం కురిసిన జోరువానకు ఇళ్లపై ఉన్న పైకప్పు రేకులు ఎగిరిపోయి దూరంగా పడ్డాయి. జోరువానకు ఈదురు గాలులు తోడవటంతో అనేక వృక్షాలు నేలకూలాయి. కరెంటు తీగలు తెగిపడటంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లపై పైకప్పులు లేచిపోయిన సమయంలో ఇళ్లలో ఉన్నవారు గాలి బీభత్సవాన్ని చూసి భయంతో కేకలు వేస్తూ వర్షంలోనే బయటకు పరుగులు తీశారు. ఇళ్లకు వందల మీటర్ల దూరంలో ఇంటి పైకప్పుల రేకులు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం తప్పింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

తొలగిన ముసుగు


జగ్జీవన్‌రామ్ విగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వేసిన ముసుగును ఎట్టకేలకు తీసివేశారు. సాక్షి దినపత్రికలో కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు.. అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు విగ్రహానికి ముసుగును తొలగించారు.

ఆశావర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

సంగారెడ్డి టౌన్: ఆశావర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశవర్కర్లకు పరీక్ష విధానాన్ని అమలు చేస్తామన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆశావర్కర్లకు కొన్ని నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్‌ఓ పద్మజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, మైపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయం కల్హేర్(బాచుపల్లి) ఒకటి, ఐదో తరగతిలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 30 సీట్లు, ఐదో తరగతిలో 22 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 18 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 21న విద్యార్థుల ఎంపిక లాటరీ పద్ధతి ద్వారా ఉంటుందన్నారు. సొంత మండల విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు జాబితా 24వ తేదీన పాఠశాల ఆవరణలోని నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తామని సూచించారు.

అనుమతి లేని పాఠశాలలను గుర్తించండి

పటాన్‌చెరు: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలో అనుమతి లేని పాఠశాలలను గుర్తించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ సిబ్బందికి సూచించారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా నమోదైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, షూ, బెల్ట్ అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసిన వివరాలు కంప్యూటర్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు.

భవన్స్ స్కూల్‌లో ఉత్తమ బోధన




ప్రిన్సిపాల్ సింగీతం చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: తమ పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన ఉంటుందని భవన్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సింగీతం చంద్రశేఖర్ అన్నారు. 25 ఏళ్ల అపార అనుభవం గల నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. జహీరాబాద్‌లో మొట్ట మొదటిసారిగా అమెరికన్ మాంటిస్సోరి మెథడాలజీతో ప్లే, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు హైబ్రిడ్ ఎడ్యుకేషన్ విద్యావిధానంతో ముందుకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. భవన్స్ పబ్లిక్ స్కూల్ ప్రత్యేకతలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు సీబీఎస్‌ఈ ఇంటిగ్రేటెడ్ సిలబస్, ఐదో తరగతి నుంచి ఐఐటీ, నీట్ మరియు సివిల్స్ సర్వీసెస్ ఫౌండేషన్, సొంత ఏసీ క్యాంపస్, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే.. డిజిటల్ తరగతులు, పబ్లిక్ స్పీకింగ్‌పై ప్రత్యేక దృష్టి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసెస్, ఏఐ అండ్ ఎంఎల్ కోడింగ్ కోసం ప్రత్యేక ల్యాబ్‌లు, ఇండోర్ గేమ్స్, యాక్టివిటీస్, రవాణా సదుపాయం ఉందని ఆయన వివరించారు. 2024–2025 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలు జహీరాబాద్‌లోని దత్తగిరి కాలనీలో ఉన్న తమ పాఠశాలలో, లేదా ఫోన్ నంబర్లు 77300 19740, 98857 19740కు సంప్రదించాలని ఆయన కోరారు.